

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

టి.నరసాపురం : మండలంలోని రాజుపోతేపల్లిలో సోమవారం ఏలూరు ఆర్‌టిసి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏలూరు నుంచి ఆర్‌టిసి బస్సు మండలంలోని రాజుపోతేపల్లి, టి.నర్సాపురం మీదుగా చింతలపూడి వెళ్లి తిరిగి ఏలూరు వెళ్తుంది. ఈ క్రమంలో ఆర్‌టిసి బస్సు సింగల్ రూటుగా ఉదయం, సాయంత్రం రెండు మార్లు తిరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏలూరు నుంచి బస్సులో ఉదయం జీలకర్రగూడెం, రాజుపోతేపల్లి, జగ్గవరం, బంధంచర్ల తదితర గ్రామాల నుంచి అనేకమంది విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు వ్యాపారులు ప్రయాణాలు చేస్తున్నారు. రాజుపోతేపల్లిలో బస్సు మరమ్మతులకు గురి కావడంతో ప్రయాణికులు తమ గమ్యాలను చేసుకోవడానికి నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్‌టిసి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా సౌకర్యవంతమైన బస్సును నడపాలని ప్రజలు కోరుతున్నారు.


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా - జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, ఆయాలు

ప్రజాశక్తి - ఏలూరు

సమస్యల పరిష్కారం కోసం ప్రతీ అంగన్వాడీ కార్యకర్త వీరనారి ఝాన్సీరాణీలా అలుపెరుగని పోరాటం చేయాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. ఈ మేరకు సోమవారం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక జ్యూట్‌మిల్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాకు ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ హసీనా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన షేక్ సాబ్జీ మాట్లాడుతూ పోరాడితేనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పాదయాత్రలో కనిపించిన ప్రతిఒక్కరికీ ముద్దులు పెట్టిన సిఎం జగన్ నేడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వాళ్లను బెదిరించడం సిగ్గు చేటన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించితేనే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. అప్పటివరకూ పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ పథకానికి కేటాయించే మెనూ ఛార్జీలకు చాక్‌లెట్ కూడా రాదన్నారు. పిఆర్‌సి అమలు చేస్తామని ప్రభుత్వ ఉద్యోగులను, పర్మినెంట్ చేస్తామని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసగించిందన్నారు. వ్యక్తిగతంగా 34 కేసులున్న జగన్ సిఎం ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర దురదృష్టమన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సలహాదారులను నియమించుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతామని హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక అంగన్వాడీలను వివిధ తనిఖీల పేర్లతో వేధించడం సిగ్గు చేటన్నారు. 16 కార్లు వేసుకుని అంగన్వాడీలను సందర్శిస్తున్న ఫుడ్ కమిషన్ ఛైర్మన్ అంగన్వాడీలను అవమానిస్తే సహించేది లేదన్నారు. ఈ ప్రభుత్వంలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. పైగా రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. వేయి రూ.వెయ్యి జీతం పెంచి అంగన్వాడీల సంక్షేమానికి ఎసరు పెట్టారన్నారు. రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టడానికి రైతాంగం చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పింఛనుతో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ ధర్నాకు యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పి.వి.నరసింహారావు, ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాజీ, కోశాధికారి గంగాధర్ సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, జి.రాజు, షేక్ సుభాషిణి, కె.వెంకట్రావు, వి.సాయిబాబా, జె.గోపి, వై.సాయికుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, పి.సుజాత, పిఎల్ఎస్.కుమారి, బిజెఎన్.కుమారి, తులసి, సరోజిని, రాజకుమారి, చెల్లమ్మ, భవాని, మాణిక్యం, రామలక్ష్మి, రజిని, ఎస్.లత, పుష్ప, రాజమణి, నాగవేణి పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జీ



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

చింతలపూడి : ఏలూరులో కలెక్టరేట్ వద్ద అంగనవాడీలు చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు ప్రయత్నించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. చింతలపూడిలోని ఆయన నివాసం వద్ద ధర్నాకు వెళ్లకుండా సిఐటియు మండల అధ్యక్షులకు, నాయకులకు నోటీసులు అందజేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

జంగారెడ్డిగూడెం : అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.రాణిరత్నప్రభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి టి.రాణీరత్నప్రభ, జిల్లా అధ్యక్షులు కెవి.రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, అనంతరం వారి సమస్యలు పరిష్కరించకుండా పనిభారం మోపిందన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని , సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఫేస్‌యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. మారుమూల ప్రాంతానికి అంగన్వాడీ సరుకులను తీసుకెళుతున్న వర్కర్లకు రవాణా ఛార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ర్యాలీలు, సభలను నిషేధిస్తూ తీసుకొచ్చిన జిఒ1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సమ్మె కూడా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, న్యాయవాది యు.ఏసుబాబు మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి వి.శిరోమణి, మడకం కన్నమ్మ, కె.మారమ్మ, కొనుతుల రామలక్ష్మి, కె.విజయదుర్గ, కొమరం ఆకాష్, మడకం కన్నమ్మ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో సోమవారం యూరియా కొరత, ధాన్యం బకాయిలు తదితర సమస్యలపై ఆయన మాట్లాడారు. సొసైటీల్లోనూ, రైతుభరోసా కేంద్రాల్లోనూ యూరియా తగినంత అందుబాటులో లేకపోవడం వల్ల అధిక ధరలకు ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. యూరియా బస్తా ధర రూ.266 అయితే రూ.300కుపైగా ధరకు ప్రయివేటు వ్యాపారులు అమ్ముతున్నారని చెప్పారు. యూరియా కొరత లేకుండా రైతులకు సరిపడు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. యూరియా కొరత కారణం చెప్పి అధిక రేట్లకు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

ఖరీఫ్ ధాన్యం బకాయిలు రైతులకు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి తొమ్మిత్తో తేదీ తర్వాత ధాన్యం బకాయి సొమ్ములు రైతుల ఖాతాలకు జమచేయలేదని ప్రధానంగా ఏలూరు, పెదపాడు మండలాల రైతులకు ధాన్యం సొమ్ములు అందలేదన్నారు. ధాన్యం బకాయి సొమ్ములు నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలకు జమచేసి ఆదుకోవాలన్నారు. ధాన్యం సొమ్ములతోపాటు హమాలీ ఛార్జీలు కూడా చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కాక అన్నదాత ఇబ్బందులు పడుతున్నారని, పంట పండించడానికే కాకుండా పంట అమ్ముకోవడానికి కూడా పెట్టుబడి పెట్టాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ ఛార్జీలు వెంటనే రైతులకు చెల్లించాలని కోరారు.

పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి

నష్టాల్లో కూరుకుపోతున్న పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఫీడ్ ధర పెరిగిపోవడంతో కోడి గుడ్లు ఉత్పత్తి చేస్తున్న పౌల్ట్రీ రైతులకు నష్టాలు వస్తున్నాయని చెప్పారు. మరోవైపు బాయిలర్ కోళ్లు పెంచుతున్న రైతులను కంపెనీల మోసాలకు నష్టపోతున్నారన్నారు. నష్టపోతున్న పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జి.రాజా, ఎన్.శేషగిరిరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.30 వేల అప్పుకు రూ.3 లక్షల వడ్డీ

ఆర్‌డిఒకు బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రూ.30 వేలు అప్పు తీసుకున్నందుకు రూ.3 లక్షలు వడ్డీ కట్టాలని ఒత్తిడి చేస్తూ మనోవేదనకు గురిచేస్తున్న పెంటారావు, పవన్ బాలకృష్ణ అనే వడ్డీ వ్యాపారుల నుంచి తనకు విముక్తి కల్పించాలని ఓ బాధితుడు స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సీరాణికి విన్నవించాడు. మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన కలపాల ప్రసాద్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస్‌తో కలిసి ఆర్‌డిఒ ఝాన్సీరాణికి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశాడు. తాను రూ.30 వేలు అప్పు తీసుకుని ఇంటి వరిజినల్ పత్రాలు హామీగా ఇచ్చానని చెప్పారు. 2010లో అప్పుగా తీసుకుని రూ.3 లక్షలు వడ్డీ కింద చెల్లించానని ప్రసాద్ తెలిపారు. ఇంకా రూ1.20 లక్షలు ఇవ్వాలని వడ్డీ వ్యాపారులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఈ నెల 9న తన కుమార్తె వివాహం జరగనున్న నేపథ్యంలో వడ్డీ వ్యాపారుల వద్ద హామీగా పెట్టుకున్న ఆస్తి పత్రాలు ఇస్తేనే పెళ్లి జరుగుతుందని తెలిపారు. మధ్యవర్తుల ద్వారా చర్చలు జరిపినా వారు వినలేదని తెలిపారు. తనకు న్యాయం చేయాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ ఝాన్సీరాణి స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిఎస్‌పికి సిఫార్సు చేశారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు, నాయకులు

1/70 చట్టాన్ని కాపాడాలని

ఐటిడిఎ వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సుప్రీంకోర్టులో ఉన్న 1/70 చట్టంకేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని గిరిజనుల పక్షాన వాదనను వినిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కెఆర్‌పురం ఐటిడిఎ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి గిరిజన చట్టాలపై దాడులు పెరిగాయన్నారు. 1/70 చట్టం సుప్రీంకోర్టులో వేశారని దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి గిరిజనుల పక్షానవాదన వినిపించాలని కోరారు. ఇప్పటికే అటవీ హక్కుల చట్టం 2006, జిఒ మూడు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం నీరు కార్చారని, ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, చట్ట సవరణకు కొంతమంది గిరిజనేతరులు ప్రభుత్వ అండతో కేసులు వేయిస్తున్నారని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం 2006 చట్ట ప్రకారం గిరిజనులకు పోడుభూములకు పట్టాలివ్వాలని అనేక దఫాలుగా దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో పట్టాలు నేటికీ అందలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలకు రక్షణగా నిలబడాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు లేని గిరిజనులకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు నాగేంద్ర, రమేష్, మడివి దుర్గారావు, చొడెం దుర్గమ్మ, పోలోజు నాగేశ్వరావు, బి.చంద్రం. చుంద్రు బుల్లమ్మ, కారం భాస్కరరావు పాల్గొన్నారు.


స్పందన అర్జీల పరిష్కారంలో..


నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. జిల్లాలో స్పందన ద్వారా స్వీకరిస్తున్న రెవెన్యూ అర్జీల పరిష్కారంపై కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలతో జెసి పి.అరుణ్‌బాబు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సమీక్షించారు. ఈ సందర్భంగా 2022 నవంబర్‌లో వచ్చిన 75 రెవెన్యూ అర్జీల ఎండార్స్‌మెంట్, ర్యాండమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం జెసి మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఎండార్స్‌మెంట్‌ను అందజేసి అర్జీదారుని నుండి సంతకం తీసుకోవాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో స్వయంగా అధికారులు వెళ్లి విచారణ చేపట్టిన ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎండార్స్‌మెంట్ పొందిన అర్జీదారునితో నేరుగా జెసి ఫోన్ చేసి సమస్య పరిష్కారాన్ని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది అధికారులు ఎండార్స్‌మెంట్ విషయంలో నాణ్యతతో కూడిన సమాచారం ఇవ్వనందున అర్జీలు రీ ఓపెనింగ్ అవుతున్నా యని తెలిపారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుం టామని జెసి హెచ్చరించారు. వచ్చే స్పందనలో డిసెంబరు ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకూ వచ్చిన అర్జీలను సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో ద్వారకాతిరుమల, దెందులూరు, గణపవరం, చింతలపూడి, బుట్టాయగూడెం మండలాల రెవెన్యూ స్పందన అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న జెసి అరుణ్‌బాబు


మునగ మొక్క పంపిణీ చేస్తున్న కలెక్టర్

ఇంటింటికీ మునగ మొక్క

మొక్కల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

బహుళ ఔషద ఉపయోగాలు కలిగిన మునగ చెట్టుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఇంటికి మునగ మొక్కలు ఉచితంగా పంపిణీకి నర్సరీలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం భీమడోలు నర్సరీలో డ్వామా ఆధ్వర్యంలో సిద్ధం చేసిన మునగ మొక్కల పంపిణీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగలో విటమిన్ సి, మాంసకృత్తులు, ఐరన్, పొటాషియం అధికంగా ఉంటాయని, మునగ ఆకు, చెట్టు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లో అవగాహన పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఔషద గుణాలున్న మునగ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉపాధిహామీలో మునగ మొక్కల నర్సరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా భీమడోలులో ఏర్పాటు చేసిన నర్సరీలో పది వేల మొక్కలు ఉచితంగా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో కూడా మునగ మొక్కల నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. నర్సరీలో పెంచిన మునగ మొక్కలను పెరటి తోట పెంపకం కింద ఆయా ఇంటి పెరటి స్థలం బట్టి ప్రతీ మహిళకు రెండు నుంచి ఐదు మొక్కల వరకూ ఉచితంగా అందిస్తామన్నారు. మహిళల్లో ఐరన్ లోపాన్ని నివారించేందుకు, పౌష్టికాహారంగా మునగ ఆకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డ్వామా పీడీ డి.రాంబాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నూతనంగా ఎన్నికైన పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు నగరంలో ఉన్న అన్ని గ్రూపుల సభ్యులకు మంచి సేవలు అందించాలని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వన్‌టౌన్, టూ టౌన్ ప్రాంతాలకు టౌన్ లెవెల్ ఫెడరేషన్ ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వన్‌టౌన్ అధ్యక్షులు దాసరి వరలక్ష్మి, టూ టౌన్ అధ్యక్షులు ఎస్‌కె.అమీన్ అన్సారి మిగిలిన సభ్యులతో కలిసి సోమవారం నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎస్‌ఎల్‌ఎఫ్ సమావేశాలకు హాజరై గ్రూపుసభ్యుల పొదుపుకు సంబంధించిన లావాదేవీలు అన్ని సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న డిఎస్‌పి లతాకుమారి

విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనేంద్రరావు అధ్యక్షతన పోలవరం డిఎస్‌పి లతాకుమారి ముఖ్యఅతిథిగా, బుట్టాయగూడెం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయబాబు ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దాదాపు రూ.40 వేల విలువైన పోటీ పరీక్షలకు సంబంధించిన, అర్థమేటిక్, రీజన్నింగ్, పోలిటీ, హిస్టరీ, జనరల్ స్టడీస్ ఇంగ్లీష్ వంటి వాటికి సంబంధించిన 130 పుస్తకాలను డిఎస్‌పి లతాకుమారి కళాశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ మనేంద్రరావు మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున, డిఎస్‌పి తన సొంత ఖర్చులతో, కళాశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను దానం చేయడం అన్ని దానాల్లోకెల్లా ఉత్తమమైందన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిఎస్‌పి లతాకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అక్కులన్న, కామర్స్ లెక్చరర్ ఎన్.భాగ్యలక్ష్మి ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. అంతేకాకుండా పోలీస్ డిపార్ట్‌మెంట్, ఐటిడిఎ, గిరినేస్తం ద్వారా శిక్షణ పొంది కానిస్టేబుల్ పరీక్షలో కళాశాల విద్యార్థిని మంజుల ఎంపికైనందుకు అందరూ అభినందించారు.

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించండి

ఎంఎల్‌ఎ ఎలిజాను కోరిన యర్రగుంటపల్లి ఎస్‌సి కాలనీవాసులు

ప్రజాశక్తి - చింతలపూడి

తమ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని ఎంఎల్‌ఎ ఉన్నమాట్ల ఎలిజాకు యర్రగుంటపల్లి ఎస్‌పి కాలనీ ప్రజలు తమ గోడును విన్నవించారు. మండలంలోని యర్రగుంటపల్లిలో ఎస్‌సి కాలనీలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీ ప్రజలు రోడ్లు, డ్రెయినేజీల సమస్యల గురించి వివరించారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్‌సి కాలనీలో సీసీ రోడ్లకు రూ.30 లక్షల మంజూరైనట్లు తెలిపారు. రోడ్లు వేయిస్తామని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తుల్లిమిల్లి రాణి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నిరజాసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మిర్యాల దిలీప్, వెంపా కృష్ణ పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

జిల్లాస్థాయి భూ సదస్సును జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భూమి, ఇళ్ల స్థలాల కోసం జరిగే జిల్లాస్థాయి భూ సదస్సును జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లాస్థాయి భూ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అందుగుల ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎం.జీవరత్నం మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఆ భూములు భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆ భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున భూపోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 8వ తేదీన టి.నరసాపురం మండలం రామన్నపాలెం గ్రామంలో భూస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత, దొమ్మేటి వెంకటేశ్వరరావు, సోమలమ్మ, జి.సూర్యకిరణ్, బి.నాని, పి.సత్తిబాబు, డి.ఆశీర్వాదం పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హెచ్‌ఐవి బాధితులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులకు, హైరిస్క్‌తో బాధపడుతున్న వారికి హెపటైటిస్ 'బి' వాక్సిన్ ఒక గొప్పవరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) వారి ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం వారి ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న అన్ని ఎఆర్‌టి సెంటర్లలో హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులకు, హైరిస్క్‌తో బాధపడుతున్నవారికి హెపటైటిస్ 'బి' వాక్సిన్ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఎఆర్‌టి కేంద్రంలో ప్రారంభించారు. జిల్లాలో 7,784 మందికి హెచ్‌ఐవితో బాధపడుతున్న వారిలో 2,513 మందికి పరీక్ష చేసి హైపటైటిస్ బి ఇప్పటికి లేదని నిర్ధారించినట్లు తెలిపారు. ఎఆర్‌టి, సిపిటి మందులు తీసుకుంటున్నప్పటికీ కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చని తెలిపారు. దాదాపు రూ.మూడు వేల విలువైన ఈ వ్యాక్సిన్‌ను ఎఆర్‌టి సెంటర్లలో డాక్టర్ల పర్యవేక్షణలో నెలకు ఒక డోస్ చొప్పున మూడు నెలలకు మూడు డోసులు ఉచితంగా ఇస్తారని, తద్వారా జీవితకాలం హెపటైటిస్ 'బి' వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. హెచ్‌ఐవితో బాధపడుతున్నవారందరూ హైరిస్క్ ప్రవర్తన కలిగిన వారందరూ కూడా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ ఎవిఆర్.మోహన్, జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంఒ డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో కొవ్వలి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 4, 5 తేదీల్లో ఏలూరులో నిర్వహించిన హేలాపురి బాలోత్సవంలో దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఇల్లాకుల పల్లవికి జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి లభించటం పట్ల పలువురు అభినందించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ప్రశంసాపత్రం, మెడల్ సాధించిన పల్లవిని, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌విజి.శర్మ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పల్లాయమ్మ, చంద్రరేఖ, మధుసూదనరావులను అభినందించారు. హేలాపురి బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయానికి నేమ్‌బోర్డు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు వెలుగు కార్యాలయానికి అధికారులు నేమ్‌బోర్డు రాయించారు. దీనిపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెలుగు ఎపిఎం డి.రాజశేఖర్ బోర్డు రాయించారు.

కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

కంటి విషయంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అశ్రద్ధ చేస్తే కంటి చూపు పోయే అవకాశాలు ఉంటాయని ప్రముఖ నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ అన్నారు. గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 402 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 35 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు వేయాల్సి ఉందని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పోషక విలువ గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జి.విల్సన్‌బాబు. ఎంఎల్‌హెచ్‌పిలు పి.కవిత, వి.పార్వతి, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఆశాలు ఆర్‌వి.రమణ. ఆర్.లక్ష్మీ, ఎంఎస్.యేహన్, స్కూల్ ప్రాశినోఉపాధ్యారాలు అనురాధ పాల్గొన్నారు.

'బహుజనులకు రాజ్యాధికారం రావాలి'

ప్రజాశక్తి - నూజివీడు

బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర కొనసాగిస్తున్నట్లు బిఎస్‌పి నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ చలిగంటి వెంకటేష్ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశానుసారం బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనాదిగా అన్ని రాజకీయ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని, మోసగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 శాతం పైగా బహుజనుల ఓట్లు ఉన్నట్లు తెలిపారు. నోట్ల రాజ్యాన్ని కూలుద్దాం, ఓట్ల రాజ్యాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వైసిపి, టిడిపి పార్టీలు ప్రజలను పూర్తిగా మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనులకు రాజ్యాధికారం బిఎస్‌పితోనే సాధ్యం అవుతుందన్నారు.

పేదలకు రమా ఫౌండేషన్స్ వితరణ

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న కాంక్రీట్ కార్మికులు, నిత్య కూలీలకు రమా ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు, పండ్లు, పోషకాహారమైన డ్రైఫ్రూట్స్ సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా రమా ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రముఖ సామాజికవేత్త కట్టా రమాదేవి మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని కార్మికులకు పోషకాహారం పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తోటి వారికి సాయం చేయడం అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. వెనుకబాటు కలిగి ఉన్న ఆధారం వనరుల నుండి అవకాశం మేరకు సాయం చేస్తూ దాతృత్వం చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఎంతటి వ్యక్తిలో దైవత్వాన్ని వీక్షించి, వారి ఆకలి తీర్చడం సాటివారిగా మన ధర్మంగా భావించాలన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు ఒక వరం వంటిదని కానుకొల్లు సర్పంచ్ నాగదాసి థామస్ అన్నారు. గ్రామానికి చెందిన వీరంకి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం వచ్చిన రూ.పది వేలను భార్య వెంకటలక్ష్మికి సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. కుటుంబంలో వ్యక్తిని కోల్పోయి ఆ కుటుంబం ఇబ్బందుల పడకుండా వారిని ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి జగనన్న వైఎస్ఆర్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టి భీమాను అందించి తిరిగి ఆ కుటుంబంలో వెలుగు నింపుతున్నారన్నారు. ఇప్పటికే ప్రజల సంక్షేమం కోరి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందిస్తూ చరిత్ర సృష్టించిన ప్రజా జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పుట్టి సత్యనారాయణ, కార్యదర్శి రత్నకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'టిడిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలోని టిడిపి కార్యాలయంలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు బొద్దు వెంకటేశ్వరరావు, తెల్లంగోపాలరావు హాజరై మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్క కార్యకర్త పట్టుదలతో పనిచేయాలన్నారు. సభ్యత్వాలను పెంచాలని, వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు వ్యయం పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, చిమటబోయిన పుల్లారావు, చాగంటి నరసింహారావు, తెలగాని శేఖర్, కమ్ముల కొండలరావు, రాయపురెడ్డి పుల్లారావు, పసుపులేటి కోటేశ్వరరావు, బలుసుగిరి రవణయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చిల్లర అడిగి పర్సు అపహరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓ వ్యక్తి రెండు వేల నోటుకు చిల్లర కావాలని అడిగడంతో మహిళ ఇస్తుండగా ఆమె చేతిలోని పర్సును లాక్కుని పరుగుతీసిన ఘటన పొంగచర్ల రాజవరంలో సోమవారం చోటు చేసుకుంది. కలపాల తులసి గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో సరుకులు కొనుగోలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్వి చక్ర వాహనంపై వచ్చి చిల్లర అడగగా ఆ మహిళ చిల్లర ఇస్తుండగా ఆమె చేతిలో ఉన్న పర్సును లాక్కుని పరారయ్యాడు. ఆ మహిళ బోరున విలపిస్తూ చుట్టుపక్కల వారికి తెలపగా అప్పటికే ఆ వ్యక్తి పరారయ్యాడు. పర్సులో రూ.పది వేల నగదు ఉన్నట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలాలనూ తవ్వేస్తున్నారు..!

వాల్టా చట్టానికి తూట్లు
కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
పట్టించుకోని రెవెన్యూ అధికారులు



చెరువులో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

ప్రజాశక్తి - మండవల్లి

రొయ్యలు సాగుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. పచ్చని పంట పొలాలను సైతం రొయ్యల చెరువులుగా మార్చేసి సాగు చేయడం వల్ల పర్యావరణంలో సమతుల్యం లోపించి కాలుష్యం పెరిగిపోయి వాతావరణంలో పెను మార్పులకు కారణమవుతుంది. రొయ్యల సాగులో వినియోగిస్తున్న రసాయనిక కారకాలు మనుష్య మనుగడను శాసిస్తున్నాయి. దీంతో భవిష్యత్ తరాలు ఆహ్లాదకర వాతావరణం కోసం స్వచ్ఛమైన తాగునీటి కోసం యుద్ధాలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే కొర్లపాడు లింగాల్లో మట్టిని తరలించేందుకు తవ్వకాలు చేపట్టిన రొయ్యల చెరువులేనని వారు స్పష్టం చేస్తున్నారు. మండలంలోని లింగాల కొర్లపాడు గ్రామాల్లో స్వల్ప అనుమతులతో భారీ చెరువుల తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. చెరువుల తవ్వకాల్లో కచ్చితమైన నిబంధనలు పాటించాలని మండల కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యావరణానికి, పంట భూములకు, భూగర్భ జలాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు మురుగు పారుదల అయ్యే చెరువులకు మాత్రమే అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాల జారీ చేశారు. కాని ఇక్కడ అధికారులు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తూ గుత్తేదారుడితో ములాఖత్ అయిపోయి నిబంధనలను తుంగలో తొక్కి కాసుల ముసుగులో కేవలం మట్టి కోసమే పచ్చని పంట పొలాలను రొయ్యల చెరువులుగా మార్చేందుకు గుత్తేదారులకు సహకరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. అధికారులు మట్టిని తరలించేసి రొయ్యల చెరువు తవ్వుకోవడానికి సహకరిస్తూ పర్యావరణానికి ప్రత్యక్షంగానే తూట్లు పొడుస్తున్నారని బహిరంగంగానే వారు విమర్శిస్తున్నారు. దీంతో అధికారులు అందిస్తున్న కోపరేషన్‌తో ఇదే అదునుగా చూసుకున్న గుత్తేదారుడు ఆరడుగుల లోతు నుంచి మట్టిని తవ్వి తరలించేస్తూ కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ రొయ్యల చెరువులపై నాణ్యవంతమైన విద్యుత్ వైర్లను వినియోగించకపోవడంతో విద్యుత్ షాక్ కొట్టి అమాయకమైన కూలీలు చనిపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా రొయ్యల సాగు వల్ల గ్రామాల్లోని మంచినీటి చెరువులు పాడై సామాన్యులు సైతం తాగునీటి కోసం నెలకు 600 పైబడి అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. దీంతో పాడిపంటలకు నెలవైన ఈ ప్రాంతం రొయ్యల సాగు వల్ల పశువులకు మేత ఉండడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా మట్టి కోసమే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టిన రొయ్యల చెరువులను నిలుపుదల చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు లోబడి రొయ్యల సాగు చేసేలా పరిమితి మేరకే రసాయనాలు వాడేలా చర్యలు తీసుకుని ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలని శాస్త్రవేత్తలు పర్యావరణ ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కె.జరీనాను వివరణ కోరగా మండల వ్యవసాయ శాఖ నుంచి అనుమతులు ఇవ్వలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీనిపై తహశీల్దార్ జనార్ధనరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

శనివారపుపేట (చొదిమెళ్లరేవు) శ్మశాన వాటికలోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం సిపిఎం శనివారపుపేట శాఖ సమావేశం జి.రవి కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ శనివారపుపేట (చొదిమెళ్లరేవు)శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ శ్మశాన వాటిక ఇటు శనివారపుపేట ఆటు చొదిమెళ్లకు రహదారిగా కూడా ప్రజలకు ఉపయోగ పడుతుందన్నారు. ముఖ్యంగా ఈ రహదారి నుంచి శనివారపుపేట హై స్కూలుకు విద్యార్థులు కూడా వస్తుంటారన్నారు. ప్రజలు సమయ భావం తక్కువగా కలిసి వస్తుందని ఇటే ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు. అటువంటి ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా పందులు, కుక్కలు చనిపోయిన జంతువుల కళేబరాలు కనిపిస్తున్నాన్నారు. ఇవి కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయన్నారు. చనిపోయిన మృతుల బంధువులు శ్మశానవాటికకు వచ్చి అంత్య క్రియలు పూర్తయ్యేవరకు ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇక్కడ అంత్యక్రియలకు వస్తున్న వారికి కనీసం వాటర్ సౌకర్యం లేదని, చుట్టూ ప్రహరీ గోడలు లేవని చెప్పారు. షెడ్డు పాడైపోయిందన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం శ్మశానవా టికలో అంత్యక్రియలకు డబ్బులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ అక్కడ సమస్యలు పరిష్కరించే దానిపై పెట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా శనివారపుపేట (చొదిమెళ్ల రేవు) శ్మశానవాటికతో పాటు నగరం, చుట్టూ ఉన్న పంచాయతీల్లో ఉన్న శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు కె.రామాంజనేయులు, సిపిఎం శాఖ సభ్యులు మురళి, రంగ మణి, పిల్ల జోగి నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామంలో కుష్టువ్యాధిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లాడుతూ మొదటిలోనే గుర్తించి చికిత్స చేయించుకుంటే కుష్టువ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. మచ్చల వల్ల కుష్టువ్యాధి, కేన్సర్ వ్యాధికి దారితీసి ఎంతో మందిని ఇబ్బంది పెడుతుందన్నారు. ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి వారికి తగిన చికిత్స చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, హెల్త్ సూపర్ వైజర్ హమ్మద్ శుభాహన్ బేగ్, వైద్యులు కృష్ణవేణి, సిహెచ్ఒ శివ, నాగమణి పాల్గొన్నారు.

మినుములో చీడపీడలను అరికట్టాలి

ప్రజాశక్తి - మండవల్లి

మినుము పైరుకు ఆశించే చీడపీడలను ముందుగా గమనిస్తే పంటను నష్టపరిచే పురుగుల ఉధృతి కొంతవరకు అరికట్టవచ్చని డిఎఎటిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్ తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ మినుము సముదాయ ప్రదర్శన క్షేత్రాన్ని సోమవారం ఎడిఎజి వెంకటమణి, ఎఒ ఎస్‌కె.జరీనాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడు భూముల్లో మినుము పైరు పెరుగుదల లోపించిందన్నారు. ఆకు అంచుల పైకి ముడుచుకుని ఉండడం గమనించామని చెప్పారు. దీనిని నివారించడానికి పొటాషియం నైట్రేట్ లీటర్ నీటికి ఐదు గ్రాముల చొప్పున ఎకరానికి ఒక కేజీ చొప్పున వారానికి మూడు సారు పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం రైతులకు అనేక సూచనలను సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

నారాయణపురం డిగ్రీ కాలేజీలో న్యూమరికల్ కార్యశాల

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో న్యూమరికల్ ట్రెండ్స్ అనే అంశంపై మూడు రోజుల కార్యశాల సోమవారం కళాశాలలో ప్రారంభించారు. ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో నైపుణ్యం సంపాదించడం ద్వారా అన్ని శాస్త్రాల్లో పట్టు సాధించడం వీలవుతుందన్నారు. గణిత శాస్త్రంలో సాధన విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ టి.శివకృష్ణ విద్యార్థులకు న్యూమరికల్ మెథడ్స్‌లో మెళకువలను నేర్పించి, న్యూటన్స్ ఫార్వర్డ్, బ్యాక్ వర్డ్, ఇంటర్ కొయి లేషన్ ఫార్ములాలు పలు అంశాలను విపులంగా వివరించి వారి చేత సాధన చేయించారు. కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.బాబురావు మాట్లాడుతూ గణిత శాస్త్రం ఎంచుకుని విద్యార్థులందరూ గణిత శాస్త్రాలను అధ్యయనం చేస్తారు కానీ అదనపు విజ్ఞానం ద్వారా శాస్త్రంలో నైపుణ్యం సంపాదించడం ఎంతో అవసరమన్నారు. ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ సకల శాస్త్రాలకు గణిత శాస్త్రం వెన్నెముక వంటిదన్నారు.

నేడు డస్ట్‌బిన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైఎస్ఆర్ స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని గొల్లగూడెంలో దాతల సహకారంతో 1200 డస్ట్ బిన్లు పంపిణీ చేయనున్నామని సెక్రటరీ యాళ్ల కిషోర్ బాబు వెల్లడించారు. గ్రామంలో 1178 ఇళ్లు ఉన్నాయని ప్రతి ఇంటికి ఒక డస్ట్ బిన్ పంపిణీ చేసేందుకు సుమారు రూ.44 వేలు ఖర్చయిందని, ఈ ఖర్చును గ్రామస్తులు విరాళంగా అందించారు. ఈ నెల 7న సమావేశంలో గ్రామస్తులకు వీటిని అందిస్తామని తెలిపారు.

నేడు దెందులూరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల ఏడో తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి బి.సుమలత అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎబిపివి.లక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని తెలిపారు.

ఆక్రమణదారునిపై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో దళితులు సాగు చేస్తున్న అసైన్డ్ పట్టా భూములకు పూర్వకాలం నుంచి ఉన్న దారిని ఆక్రమించిన కె.రాజేంద్రప్రసాద్‌పై చర్యలు చేపట్టి దారి ఏర్పాటు చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు ఆధ్వర్యంలో స్పందనలో తహశీల్దార్ విశ్వనాధరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ నరసింహారావుపాలెం గ్రామంలో 1979లో నిరుపేదలైన దళితులకు ఆర్ఎస్ నెంబర్ 1661లో ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చిందని, అప్పటి నుంచి ఆ భూములకు వెళ్తున్న దారిని ఒక వ్యక్తి ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అతను పల్లె నాగయ్యకు ఇచ్చిన అసైన్డ్ పట్టాలో దారి భూమి పోను మిగిలిన 45 సెంట్లు భూమిని కొనుగోలు చేసి మొత్తం 0.50 సెంట్లు తనదేనంటూ దళితులు భూముల్లోకి వెళ్లకుండా దారిని ఆక్రమించటం అన్యాయమన్నారు. తక్షణం 9/77 యాక్ట్ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దళితుల భూముల్లోకి దారి ఏర్పాటు చేయాలని తహశీల్దార్ విశ్వనాధరావును కోరారు. రేపే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ విశ్వనాధరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరావు, కోట సుందరం, కోట రాజు, శిరోమణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న డిఎస్‌పి లతాకుమారి

ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి సూచించారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణ, సైబర్ క్రైమ్ నివారణతో పాటు అత్యాచార నిరోధాలు జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్‌పి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు ఎక్కువగా ట్రాఫిక్ ఉల్లంఘనలు చేయడం వల్ల జరుగుతున్నాయన్నారు. యువత ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా జరుగుతున్న నేరాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రపంచాన్ని అరచేతుల్లోకి అందిపుచ్చుకునే పరిజ్ఞానాన్ని పొంది ఉన్న సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు నూతన పద్ధతుల్లో అనేక రకాలైన సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే రిక్వెస్ట్‌లను అపరచిత వ్యక్తులతో పంచుకోరాదని హితవు పలికారు. అపరచిత వ్యక్తుల పరిచయాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్ బాలికలపై జరిగే అఘాయిత్యాలలో విద్యార్థినిలు నిర్వహించాల్సిన పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్ఐ కె.సతీష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు బి.లింగస్వామి పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆనందం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న ఇళ్ల యజమానులు మురుగు నీరు డ్రెయినేజీలోకి పోకుండా రోడ్లమీదకు వదలడంతో రహదారి మొత్తం బురదమయంగా మురికి గుంటలు ఏర్పడ్డాయన్నారు. చిన్నంపేట గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుండటంతో పక్కనే ఉన్న స్కూల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించి బురద నీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చైతన్య యువజన సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శంగా నిలిచిన చైతన్య యువజన సంఘం సేవలు అభినందనీయమని వైసిపి భీమడోలు మండల కన్వీనర్, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్ తెలిపారు. సంఘ అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని (క్యాలెండర్)ను ఆయన భీమడోలులో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన పలు సేవా కార్యక్రమాలను నిర్వహించటం, ఇదే క్రమంలో ప్రభుత్వం పలువురి ప్రముఖుల పేర ప్రత్యేకించిన దినోత్సవాలను చేపట్టడం వంటి కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలను వ్యక్తిగతంగా, ప్రభుత్వ సహకారంతో సంఘం చేపడుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం కేంద్రం, జాతీయ యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను సంఘం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ డైరెక్టర్లు సవలం నాని, కె.భాస్కరరావు, వైసిపి ప్రముఖులు ముళ్లగిరి జాన్సన్, అంబటి నాగేంద్రప్రసాద్, మద్దాల అప్పారావు, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్మశానాన్ని ఆక్రమించిన భూస్వామిపై చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. మండలంలోని తాడువాయిలో శ్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) మహాజన సోషలిస్ట్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బొడ్డపాటి శ్రీను అధ్యక్షత వహించగా మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో-కన్వీనర్ విసంపల్లి సిద్దు మాట్లాడుతూ తాడువాయి సర్వే నెంబర్ 338లో 5.8 ఎకరాల శ్మశానభూమి అన్యాక్రాంతానికి గురైందని తెలిపారు. ఈ భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన విఆర్ఒ, తహశీల్దార్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ వాసు చౌదరి, ఎంఎస్‌పి పట్టణ అధ్యక్షులు బొడ్డపాటి పండు, ఎండి సలీమా, చంద్రా రవి, కంకిపాటి రామారావు, దానియేలు, సతీష్, బొడ్డపాటి కృష్ణ, సిహెచ్.ఏసు, కంకిపాటి సాయమ్మ, అక్కమ్మ, చిన్నదుర్గమ్మ, క్రాంతి చాంద్రా యేసు పాల్గొన్నారు.

'స్పందన'లో పలు ఫిర్యాదులు

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో సోమవారం పెదవేగి మండలంలో పలు ఫిర్యాదులు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాలుగు ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ ఎస్.నాగరాజు చెప్పారు. పొలం సబ్ డివిజన్ చేయాలని రెండు ఫిర్యాదులు, దారి ఆక్రమణకు గురైందని దానిని పరిష్కరించాలని ఒక ఫిర్యాదు, ఒక రైతు పొలం పోలవరం కాలువలో పోయిందని నష్ట పరిహారం ఇవ్వలేదని, భూమిని ఆన్‌లైన్ చేయాలని ఒక రైతు స్పందనలో ఫిర్యాదు చేశారని తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజ్‌మనోజ్ తదితర అధికారులు పాల్గొన్నారు. చక్రాయగూడెం విఆర్ఒపై గ్రామస్తులు ఏలూరు స్పందనలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న చెరువు ల్లో ఆక్రమణలు తొలగించమని కోరితే సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని చక్రాయగూడెం విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న పూజారి సుబ్రమణ్యంపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని సీతారామ పురం గ్రామానికి చెందిన గొర్రెల సుధాకర్ సోమవారం కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు

15 వరకూ ఇ-పంట నమోదు

ప్రజాశక్తి - భీమడోలు

ఇ-పంట నమోదుకు తుది గడువు ఈ నెల 15తో ముగుస్తుందని భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. భీమడోలు మండల పరిధిలో 4000 మంది రైతులు 13,,700 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేస్తున్నారన్నారు. వీరికి అదనంగా మరి కొంతమంది కౌలు రైతులు ఉన్నారన్నారు. వీరిలో ఇప్పటివరకు 1206 మంది మాత్రమే ఇ-పంటలో నమోదయ్యారన్నారు. మిగిలినవారు త్వరితగతిన ఇ-పంటలో నమోదై ప్రభుత్వం ప్రత్యేకించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని చింతలపూడి ఎస్‌సి సెల్ టిడిపి అధ్యక్షులు పల్లి శ్రీను, ఐ టిడిపి నియోజకవర్గ కన్వీనర్ అవినాష్, మారుమూడి థామస్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలపూడి ప్రభుత్వ హాస్పిటల్‌లో గైనకాలజీ డాక్టర్, అనస్తీషియా డాక్టర్, చిన్నపిల్లల డాక్టర్లను నియమించాలన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయక శిథిలావస్థలో ఉన్న అంబులెన్స్ స్థానంలో నూతన అంబులెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు.